క్లుప్తంగా

నిబంధనలు పాటించని స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాల: విద్యా చట్టాలను ఉల్లంఘిస్తున్న స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డీఈవో రాములు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జాబితాపూర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఓ టీచర్ విద్యార్థినిపై గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పేరిట వేధిస్తున్నా పాఠశాల యజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు. పాఠశాల భవన నిర్మాణ సమయంలో ప్రమాదం జరిగినా పట్టించుకోలేదన్నారు. ఇలా ఆ స్కూల్‌లో ఏం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బోనగిరి సురేశ్, నక్క రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం


సమస్యలు తెలుసుకుంటున్న నారాయణ

కోరుట్లరూరల్: కోరుట్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీజీఈఆర్ఎఫ్ సంస్థ పని చేస్తుందని సంస్థ అధ్యక్షుడు ఎరుకల నారాయణ అన్నారు. పట్టణంలోని కల్లూర్ రోడ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వేసవిలో 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి ఇప్ప రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మల్లాపూర్: ఉపాధ్యాయులు సాంకేతిక వాడకంలో ముందువరుసలో ఉండాలని కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు పురుషోత్తం, శ్రీధర్, విశ్వనాథ్, రాజు, సీఆర్పీ మహేశ్,పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అవసరం


ప్రయోగాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కథలాపూర్: విద్యార్థులకు ప్రయోగాత్మక విద్య అవసరమని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కథలాపూర్ మండలకేంద్రంలోని మాస్టో పాఠశాలలో కిడ్స్ సైన్స్–2025 వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించిన ప్రయోగాలను విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ఎంఈవో శ్రీనివాస్ తిలకించి ఉత్తమ ప్రయోగాలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, హెచ్ఎం రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 40వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలె జయశ్రీ శేఖర్, కరస్పాండెంట్ నిఖిల్ పాల్గొన్నారు.


రథోత్సవానికి ముస్తాబైన పోచమ్మ ఆలయాలు

బుగ్గారం: మండలకేంద్రంలోని ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయాలు రథోత్సవానికి ముస్తామయ్యాయి. అమ్మవారల రథోత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఒగ్గుడోలు, డప్పు కళాకారుల వాయిద్యాలు ఆకట్టుకోనున్నాయి. రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడుతుంటారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మసర్తి నర్సయ్య తెలిపారు.

మల్లన్న అగ్ని గుండాలు



కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అగ్నిగుండాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళ భక్తులు ఆలయంలో పూజలు చేశారు. అనంతరం భక్తులు కోరిన కోర్కెలు తీర్చాలని వేడుకుంటూ అగ్నిగుండాలపై నడిచి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు యాదవ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు


పూజలు చేస్తున్న భక్తులు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీభక్తమార్కండేయ ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. స్వామివారి 49వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థాపిత దేవతల పూజ, గాయత్రి మాతలు పంచామృత ఫలాభిషేకం జరిపించారు. ప్రత్యేక పూజలు కన్నుల పండువగా సాగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మేడిపల్లి శ్రీనివాస్‌శర్మ, తిగుళ్ల విష్ణుశర్మ, భరత్, ఆంజనేయులు, పద్మశాలి సేవాసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

మెరిసిన విద్యాకుసుమాలు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రామకృష్ణ, అధ్యాపక బృందం

జగిత్యాల: యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ సంచాలకులు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ సేవ పథకం – వ్యక్తిత్వ నిర్మాణ వారధిగా వాలంటీర్ల ప్రతిభను పెంపొందిస్తూ.. సమాజానికి తమ వంతుగా అందిస్తున్న సేవలను శిబిరంలో ప్రదర్శించారు. ఇందులో విద్యార్థులు శ్రీయకుమారి, మనీష బతుకమ్మ బోనాలు, పీరీల పండగ, జానపద గేయాలు, వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ చూపారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ వీరిని అభినందించారు. సమైక్యత శిబిరంలో ప్రతిభ కనబర్చి జిల్లాకు గుర్తింపు తీసుకురావడం గర్వకారణమన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీలత, సంగీతరాణి, సుజాత, కళాశాల ఉపన్యాసకులు ప్రమోద్‌కుమార్, చంద్రయ్య, వరప్రసాద్, వాసవి, నీరజ తదితరులు ఉన్నారు.

విభిన్న కళలు నేర్చుకున్న



పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన జాతీయ సమైక్యత శిబి రం మరువలేనిది. 14 రాష్ట్రా ల వాలంటీర్లు పాల్గొన్న ఈ శిబిరంలో శాతావహన యూనివర్సిటీ నుంచి ప్రాతినిధ్యం వహించడం గ ర్వంగా ఉంది. ఇందులో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ, బోనాలు, పీరీల పండగ, జాతీయ గేయాలపై నృత్యాలు పలువురి ప్రశంసలు పొందింది. ప్లాస్టిక్ రహిత దేశ నిర్మాణానికి నా వంతు కృషి చేస్తా.

– మర్రిపల్లి శ్రీయకుమారి, బీఎస్సీ (బీజెడ్సీ)

ఉత్తేజం ఇచ్చింది



ఎనిమిది రోజులు జాతీయ సమైక్యత శిబిరంలో శాతావాహన యూనివర్సిటీ నుంచి పాల్గొనడం నూతన ఉత్సాహానిచ్చింది. ఇందులో యోగా, ధ్యానం, పచ్చదనం పరిశుభ్రత, సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఇచ్చాం. ఇది నా జీవితంలో మరిచిపోలేనిది. అవకాశం కల్పించి ప్రోత్సహించిన అధ్యాపక బృందానికి అభినందనలు. శిబిరంలో చాలా విషయాలు ప్రత్యక్షంగా నేర్చుకున్నాం.

– సట్ల మనీషా, బీకాం

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: విద్యార్థులు చదువుతో పాటు, అన్ని రంగాల్లో ఉండాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్, ఫోర్ట్ హైస్కూల్, న్యూ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన స్టేట్ లెవల్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో గోల్డ్‌మెడల్, సిల్వర్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించి ముస్ముందు కూడా మరిన్ని మెడల్స్ సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైనార్టీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్, ఆరుముల్ల పవన్ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం

పట్టణంలోని తులసీనగర్ శ్రీ నరసింహస్వామి ఆలయంలో నిర్వహించే స్వామివారి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

దీన్‌దయాల్ సేవలు మరువలేనివి

జగిత్యాలటౌన్: భారతదేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేయడంలో పండిత్ దీన్‌దయాల్ పాత్ర మరువలేనిదని భారత్ సురక్షా సమితి నాయకులు అన్నారు. పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా మంగళవారం తహసీల్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. పండిత్ దీన్‌దయాల్ 1980 లో స్థాపించిన జనసంఘ్ బీజేపీగా అవతరించి దేశాన్ని పాలిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పుప్పాల సత్యనారాయణ, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కుమ్మరి తిరుపతి, ఆకుల శ్రీనివాస్, లవన్‌కుమార్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ముగ్గులతో గ్రామ చిత్రపటం

జగిత్యాలఅగ్రికల్చర్:సిరిసిల్ల వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా, కొడిమ్యాల మండలం పూడూరు గ్రామ రైతులతో మూడునెలలుగా మమేకమయ్యారు. మంగళవారం గ్రామంలోని దేవాలయాలు, పాఠశాలలు, గ్రామ పంచాయతీలతో కూడిన రంగులముగ్గులతో చిత్రపటాలు వేశారు. ఈ చిత్రపటాలను రైతులు చూసి, విద్యార్థులను అభినందించారు. వ్యవసాయ వర్సిటీ మాజీ సలహా మండలి సభ్యుడు వెల్ముల రాంరెడ్డి, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఏఈఓలు రాజేశ్, గ్రీష్మ, శ్రీలత, ఫర్టిలైజర్ డీలర్స్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా నవీన్

కోరుట్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ పెద్దపెల్లి జిల్లా బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ నియమితులయ్యాడు. ఈ మేరకు మంగళవారం పెద్దపెల్లి జిల్లా మంచిర్యాల, రామగుండం నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

ఉద్యమకారుల సంఘం నియోజకవర్గ కో కన్వీనర్‌గా ధనుంజయ్

సారంగాపూర్: తెలంగాణ ఉద్యమకారుల సంఘం జగిత్యాల నియోజకవర్గ కోకన్వీనర్‌గా బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మామిడిపల్లి ధనుంజయ్ నియమితులయ్యారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం, జిల్లా కన్వీనర్ చింతల గంగాధర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌డీలో సీటు సాధించిన యువతి

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్ గ్రామానికి చెందిన గడ్డం నందిని అనే విద్యార్థిని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ సీటు సాధించింది. గ్రామానికి చెందిన రైతు చిన్నరాజం–అంజమ్మల కూమారుడు సిద్దార్థ సైతం నాలుగేళ్ల క్రితం డిల్లీ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా ఎస్సీ క్యాడర్‌లో మొదటి ర్యాంకుతో పీహెచ్‌డీలో సీటు సాదించాడు. తాజాగా వారి కూతురు నందిని సాదించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి


ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న శ్రావణి

జగిత్యాలటౌన్/కోరుట్ల: ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే,బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ ప్రభాకర్ అన్నారు. జగిత్యాల, కోరుట్లలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ శ్రేణులు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నలువాల తిరుపతి, పార్లమెంట్ కోకన్వీనర్ గుంటుక సదాశివం, ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ సుదవేణి మహేష్, పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామికి విప్ ఆది శ్రీనివాస్ పూజలు

మేడిపల్లి: భీమారం మండలంలోని మన్నేగూడెం, వెంకట్రావుపేట గ్రామాల్లో జరుగుతున్న మల్లికార్జున స్వామి వారి జాతరలో వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేశ్ రెడ్డి, ఏనుగు రమేశ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు సత్తిరెడ్డి, అజిత్‌రావు, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారుల నియామకం

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలకు రిటర్నింగ్ అధికారులు, సహాయ అధికారులను నియమించారు. మేడిపల్లి–1, కట్లకుంట, పోరుమల్ల ఎంపీటీసీ స్థానాలకు జీ. విజయ కుమారి, హరికిషన్. మేడిపల్లి – 2, కొండాపూర్, వల్లంపల్లి కి పసునూరి ప్రకాశ్, రాజన్న, దమ్మన్నపేట, కల్వకోట, కాచారం స్థానాలకు జీ. వెంకట రమణ, జనార్ధన్‌ను కేటాయించారు. భీమారం, మన్నేగూడెం, వెంకట్రావుపేటకు అబ్దుల్ హమీద్, రాజశేఖర శర్మ, రాజలింగంపేట, ఈదుల లింగంపేట, గోవిందారం స్థానాలకు ఏ.కరుణ, శ్రీధర్‌ను కేటాయించారు. భీమారం మండలంలో 6 స్థానాలు, మేడిపల్లి మండలంలో 9 స్థానాలను ఏర్పాటు చేశారు.

13న రాజకీయ పార్టీలతో సమావేశం

మల్లాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13న అన్ని రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల పరిధిలోని వార్డుల వారీగా ఓటర్ల ప్రదర్శించిన జాబితా, మార్పు చేర్పులపై అభ్యంతరాలుంటే కోరాలన్నారు.

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలి

రాయికల్: కొత్తపేట రాజరాజేశ్వరస్వామి నాగాలయంలో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఖయ్యూం కోరారు. మంగళవారం ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో అధి కారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో సుష్మ, వైద్యాధికారి సతీశ్, ఎస్సై సుధీర్‌రావు, డెప్యూటీ తహసీల్దార్ గణేశ్, పీఆర్ ఏఈ ప్రసాద్, ఈవో విక్రమ్, ట్రాన్స్‌కో ఏఈ రాజేశం, అర్చకులు రాజేశ్వరశర్మ, పాల్గొన్నారు.

‘అర్చకుడిపై దాడిని ఖండించాలి’

జగిత్యాలటౌన్: చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడు సిరిసిల్ల పార్థసారథి శర్మపై దాడిని సమాజంలోని ప్రతీ ఒక్కరు ఖండించాలని బ్రాహ్మణ సమాజం ప్రతినిధి సిరిసిల్ల రాజేందర్‌శర్మ కోరారు. పార్థసారథి శర్మపై దాడిని ఖండిస్తూ మంగళవారం జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి వద్ద గల మడేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ దాడికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల వేణుగోపాల్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

జగిత్యాల: చిలుకూరి బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి అత్యంత అమానుషమని, దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర 6 ఆలయ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామరాజ్యం పేరుతో ఆయనై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మురికినీరు తొలగింపు



రాయికల్: మండలంలోని మూటపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీటిని కార్యదర్శి దేవదాస్ స్పందించి కార్మికులతో తొలగించారు. మంగళవారం ‘సాక్షి’లో రోడ్డుపై మురికినీరు అనే ఫోటో స్టోరీ ప్రచురితం కాగా, స్పందించి నీటిని తొలగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా ప్రాంగణం శుభ్రం



సారంగాపూర్: మండలంలోని ధర్మనాయక్‌తండా క్రీడా ప్రాంగణాన్ని అధికారులు మంగళవారం శుభ్రం చేయించారు. ఈ నెల 10న సాక్షిలో ధర్మనాయక్‌తండా క్రీడాప్రాంగణం నిర్వాహణ సరిగా లేదని, ముళ్లపొదలతో నిండిందని ఫోటో స్టోరీ ప్రచురించగా, స్పందించిన ఎంపీడీవో చౌడారపు గంగాధర్ క్రీడాప్రాంగణంలోని చెట్లను, ముళ్లపొదలను కూలీలను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిపై గ్రామస్తులు సాక్షికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదువుకోవాలి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


విద్యార్థినులతో ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల/మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం: విద్యార్థులు ఒత్తిడితో కాకుండా ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్, ఆరపేట సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ఇబ్రహీంపట్నం కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూళ్లను మంగళవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తేవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య కిట్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం:మండలంలోని మిచ్చమ్మ చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా సభ్యుడు కోట శివకుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య కిట్లు, డస్ట్‌బిన్‌లను మంగళవారం పంపిణీ చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి కందూకూరి కరుణశ్రీ, సోషల్ వర్కర్ గొనెపల్లి గంగాధర్, మిచ్చమ్మ ట్రస్ట్ ఇన్‌చార్జి ఎం. రాజేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ పవిత్రత కాపాడుకునేందుకే బోర్డు ఏర్పాటు

జగిత్యాలరూరల్: ఆలయ పవిత్రతను కాపాడుకునేందుకే అన్యమత ప్రచారం నిషేధమని బోర్డు ఏర్పాటు చేసినట్లు అంబారిపేట గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బోర్డు ఏర్పాటు చేశామని, ఏ మతానికి గానీ, వ్యక్తులకు గానీ కించ పర్చాలనే ఉద్దేశ్యం తమకు లేదన్నారు. బోర్డు తీసివేయాలని పోలీసులు గ్రామస్తులపై ఒత్తిడి పెంచడంతో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హోమం

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట శ్రీ వెంకటేశ్వరస్వామి 25వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

విద్యార్థినులకు అవగాహన

రాయికల్: విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని సీడీపీవో మమత అన్నారు. రాయికల్ మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం 10 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాయికల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆరోగ్యం, ప్రేరణ, వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం కౌన్సిలర్ గౌతమి, సూపర్‌వైజర్లు పద్మావతి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబారిపేటలో బైక్ చోరీ

కథలాపూర్: మండలంలోని అంబారిపేటలో శనిగారపు అశోక్ అనే వ్యక్తికి చెందిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అశోక్ తన బైక్‌ను గ్రామశివారులో తన పంట పొలం వద్ద సోమవారం సాయంత్రం పార్కింగ్ చేశారు. కొద్దిసేపటికే బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తి ఎత్తుకెళ్లారన్నారు. మంగళవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సంఘటన స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బంది పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధుల ఆత్మహత్యలపై విచారణ జరపాలి

జగిత్యాల: రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న వృద్ధుల ఆత్మహత్యపై విచారణ జరిపించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం సంఘ కార్యాలయంలో వృద్ధుల ఆత్మహత్యలు అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కుటుంబసభ్యులు వృద్ధులను పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ఆత్మహత్యలు బాధాకరమని, వీటిపై విచారణ జరపాలన్నారు. విశ్వనాథం, ప్రకాశ్‌రావు, హన్మంతరెడ్డి, బొల్లం విజయ్, యాకూబ్, అశోక్ పాల్గొన్నారు.